క్లుప్తంగా

నేడు సభాపతి కల్యాణం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 11గంటలకు రుద్రాక్ష అంబారి వాహనసేవ జరుగనుంది. రాత్రి 7గంటలకు శ్రీ సభాపతి కల్యాణం నిర్వహించ నున్నారు. ఆలయ ప్రాంగణంలోని 16 కాళ్ల మండపం వద్ద సభాపతిగా పిలిచే నటరాజస్వామి, శివకామి సుందరి కల్యాణం నిర్వహిస్తారు. ఈ ఉత్సవాన్నే ఆనందరాత్రిగా వ్యవహరిస్తారు.

వీణాపాణిగా విహరించిన శ్రీహరి


హంసపై స్వామివారు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధంగా ఉన్న ప్రసిద్ధ శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారు వీణాపాణియై హంస వాహనంపై పురవీధుల్లో విహరించారు. భక్తులు అడుగడుగునా కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారుతులు సమర్పించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

తీరిన తాగునీటి సమస్య

బుచ్చినాయుడుకండ్రిగ: పంచాయతీలోని ఈబీసీ కాలనీ తాగునీటి సమస్య ఆదివారం పరిష్కారమైంది. చేతి పంపు మరమ్మతులకు గురికావడంతో తాగునీటి సమస్య తలెత్తింది. దీనిపై సర్పంచ్ వెంకటమ్మ, ఉపసర్పంచ్ మునిరాజా, గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ స్పందించారు. వారు పంచాయతీ నిధులతో బోరు వేసి, చేతిపంపును బిగించారు.

ఘనంగా అమావాస్య పూజలు


బీఎన్‌కండ్రిగ ఆలయంలో విశేష అలంకరణ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కారణి, బుచ్చినాయుడుకండ్రిగ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ఆదివారం అమవాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అభిషేక పూజల అనంతరం విశేషంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఉత్సవమూర్తులను సైతం అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పండరీ భజన ఆకట్టుకుంది.

ఆరెలో మార్మోగిన జగన్ నినాదాలు


కరపత్రాలు అందిస్తున్న గవర్ల కృష్ణయ్య

కేవీబీపురం: మండలంలోని ఆరె గ్రామం ఆదివారం జై జగన్ నినాదాలతో మార్మోగింది. జెడ్పీటీసీ సభ్యురాలు మూర్తిమునెమ్మ ఆధ్వర్యంలో గ్రామంలో మండల అధ్యక్షుడు గవర్లకృష్ణయ్య 'నేను సిద్ధం మా బూతు సిద్ధం ' కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ఆ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని తెలియజేస్తూ కరపత్రాలను ఇంటింటికీ పంచారు. గవర్లకృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాల్సిందేనని తెలి పారు. జగనన్న వల్ల జరిగిన మంచిని గుర్తించి వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని కోరారు. గ్రామంలో ప్రతి గడప వద్ద నాయకులకు ఘన స్వాగతం లభించింది. జై జగనన్న నినాదాలతో హోరెత్తించారు. అనంతరం కోటమంగాపురం, మిద్దికండ్రిగ గ్రామాల్లో ఈ కా ర్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు సుబ్బన్న, నేతలు ఢిల్లీ, మోహన్, పెద్ద సంఖ్యలో నాయకులు, బూత్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

పోలీసు, కేంద్ర బలగాల కవాతు


నాగలాపురంలో పోలీసు, కేంద్ర బలగాల కవాతు

నాగలాపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రజలకు భరోసా కల్పించేందుకు మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం కేంద్ర పోలీసు, బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. సత్యవేడు సీఐ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ సామాన్య ప్రజలకు రాబోయే ఎన్నికలను శాంతియుతంగా, ప్రశాంతంగా నిర్వహిస్తామని భరోసా కల్పించేందుకు కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాగలాపురం ఎస్సై ఓబయ్య, సిబ్బంది హనీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

శివం.. పరవశం

శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయం భక్త పారవశ్యంతో అలరాలుతోంది. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఆలయంలో శంభో శంకర.. హరహర మహాదేవ నామస్మరణలు మిన్నంటాయి. ఉదయం అధికార నంది వాహనంపై శ్రీస్వామివారు. కామధేనువుపై శ్రీజ్ఞానాంబిక అమ్మవారు కొలువుదీరి పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. తొలుత ఆలయంలో శ్రీస్వామి, అమ్మవార్లకు ఆలయం విశేష పూజలు నిర్వహించారు.

–శ్రీకాళహస్తి


నంది వాహనంపై స్వామివారు, కామధేనువుపై అమ్మవారి విహారం




ఆలయంలో విశేష పూజలు, కల్యాణోత్సవానికి పెండ్లిమండపం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న దేవస్థానం చైర్మన్ అంజూరు శ్రీనివాసులు


శివపార్వతుల కళ్యాణ ఘట్టాన్ని ప్రదర్శిస్తున్న గోపాలాచారి, జోషి హారతి శిష్య బృందం

ఓం నమఃశ్శివాయ..చంద్రకళాధర

శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం ధూర్జటి కళాప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం ఆహుతులను రంజింపజేశాయి. తెలంగాణకు చెందిన ఆద్య నృత్యాలయ కళాకారులు గోపాలాచారి, జోషి హారతి తమ శిష్య బృందంతో చేసిన శివపార్వతుల కళ్యాణం నృత్య ప్రదర్శన కట్టిపడేసింది. హైదరాబాదుకు చెందిన భవానీ విజయ్ శిష్య బృందం భరతనాట్య ప్రదర్శన రసరమ్యంగా సాగింది. వేదికపై ఆలయ అధికారులు కళాకారులను దుశ్శాలువ, ప్రశంసాపత్రాలతో సత్కరించారు.

–శ్రీకాళహస్తి



భవాని విజయ్ శిష్య బృందం భరతనాట్య ప్రదర్శన

కమనీయం.. శివ పార్వతుల కళ్యాణం


సత్యవేడు: మాంగల్యం చూపుతున్న అర్చకులు


వరదయ్యపాళెం: కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

సత్యవేడు: మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా ఆదివారం సాయంత్రం స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీస్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి కల్యాణాన్ని తిలకించి పులకించారు. పూజారులు మల్లికార్జున, మోగిశ్వరయ్య, బాలాజీ దేవర్ భక్తులకు ప్రసాదాలు పంచి పెట్టారు. ఆలయ ధర్మకర్త ఇందూరు రవికుమార్ ఆధ్వర్యంలో అన్నదానం, ప్రసాదాలు పంపిణీ చేశారు.

వరదయ్యపాళెం మండలంలో..

వరదయ్యపాళెం: మండలంలోని జ్యోతీనగర్ శ్రీపార్వతి సమేత జ్యోతీశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి 11గంటలకు పైన కల్యాణోత్సవం కనుల పండుగగా జరిగింది. తొలుత స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, లలిత



వరదయ్యపాళెం : జ్యోతీశ్వరస్వామి ఊరేగింపు, వాలీశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవం

సహస్రనామం, పూజ కార్యక్రమాలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఉత్సవమూర్తులను పట్టుపీతాంబరాలు, బంగారు అభరణాలు, సుగంధభరిత పుష్ప మాలికలతో ప్రత్యేకంగా అలంకరింపజేశారు. అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నందకుమార్ నాయుడు దంపతులు ప్రసాదాలు అందజేశారు. కల్యాణోత్సవం సందర్భంగా పలువురు నూతన వధువరులు వివాహం చేసుకుని ఒక్కటయ్యారు. ఎస్‌ఐ ప్రతాప్ ఆధ్వర్యంలో ఏఎస్‌ఐలు షణ్ముగం, సిబ్బంది భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సంతవేలూరులో..:

మండలంలోని సంతవేలూరు శ్రీకామాక్షిదేవి సమేత వాలీశ్వరస్వామి ఆలయంలో మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శివపార్వతుల కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది. స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి కళ్యాణోత్సవం నిర్వహించారు. పెళ్లి పెద్దలుగా ఆలయ ధర్మకర్త మాయాని శేఖర్‌రెడ్డి దంపతులు వ్యవహరించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఏ నోట విన్నా సిద్ధం సభ చర్చలే..

వరదయ్యపాళెం: బాపట్ల జిల్లా మేదరమేట్ల నాల్గవ సిద్ధం సభ సందర్భంగా టీవీల వద్ద సందడి నెలకొంది. ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం కోసం టీవీలకు ప్రజలు, పార్టీ శ్రేణులు హత్తుకుపోయారు. టీ స్టాళ్లు, బార్బర్ షాపులు, హోటళ్లు, జనసంచారం ఉండే ప్రాంతాల్లో టీవీల వద్ద సందడి నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో అందరూ ఇళ్ల వద్దే ఉదయం 10గంటల నుంచి టీవీల వద్ద సిద్ధం సభ సన్నాహాలను వీక్షించారు. మధ్యాహ్నం 4–30 నుంచి సీఎం ప్రసంగం మొదలు కాగానే అన్ని చోట్ల ఆసక్తి పెరిగింది. 15 లక్షలకు పైగా జనం సిద్ధం సభకు హాజరు కావడంతో పార్టీశ్రేణుల్లో ఉత్సాహం


నాగలాపురం: టీవీలో సిద్ధం సభ వీక్షిస్తున్న స్థానికులు

నింపింది. గంటకు పైగా సభలో సీఎం ప్రజలు ఆలోచించే విధంగా ప్రసంగించడం ఆసక్తికరంగా మారడంతో ఎటుచూసినా, ఏ నోట విన్నా సిద్ధం సభ గురించి చర్చ జరగడం గమనార్హం.

బోరు పనులు ప్రారంభం



నాగలాపురం: పంచాయతీలోని వడ్లకుప్పం గ్రామస్తుల తాగునీటి సమస్య పరిష్కరానికి ఆదివారం బోరు పనులు ప్రారంభించారు. సర్పంచ్ చిన్నదొరై ఎంపీపీ నిధులతో సర్పంచ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శ్యామ్, దేశన్, దేశప్పన్, కుబేరన్, దాము, బాల, మైకిల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దక్షిణ కైలాసధామం ప్రారంభం



శ్మశాన వాటిక



అధునాతన ముక్తిధామం

- మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని స్వర్ణముఖి నది ఒడ్డున రూ.3.10 కోట్లతో నిర్మించిన దక్షిణ కైలాస ముక్తిధామం(శ్మశానవాటిక)ను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో దశాబ్దాలుగా శ్మశాన వాటిక లేదు. మృతదేహాలను స్వర్ణముఖి నదిలోనే ఖననం, దహనం చేస్తున్నారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దీనిపై తీవ్రంగా స్పందించారు. ప్రజలకు సౌకర్యంగా దక్షిణ కైలాస ముక్తిధామం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. స్వర్ణముఖి నది ఒడ్డున దక్షిణ కైలాస ముక్తిధామం భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. సోమవారం ఉదయం 8గంటలకు పట్టణంలోని న్యాయస్థాన భవనం సమీపంలోని స్వర్ణముఖి నది ఒడ్డున దీన్ని ప్రారంభించనున్నారు.

ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి


రేణిగుంట స్కూలు వార్షికోత్సవంలో పాల్గొన్న డీఎస్పీ భవ్యకిషోర్


పాపానాయుడుపేట మల్లికార్జునస్వామి ఉత్సవాల్లో విద్యార్థుల నృత్య ప్రదర్శన

రేణిగుంట: విద్యార్థులు చిన్నతనం నుంచి ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకై నిరంతర కృషి చేయాలని రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్ సూచించారు. రేణిగుంట చెక్‌పోస్ట్ సమీపంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో రేణిగుంట గౌతమి ఆక్స్‌ఫోర్డ్ స్కూల్ 7వ వార్షికోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ చదువే సమాజంలో మనిషిని ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందన్నారు. ప్రతిభచూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. తిరుపతి సాయిసుధా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సుకుమార్, స్కూల్ ప్రిన్సిపాల్ గౌతమి పాల్గొన్నారు.

ఏర్పేడులో నృత్య ప్రదర్శన

ఏర్పేడు మండలం పాపానాయుడుపేట శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్థానిక సాయి బ్రిలియంట్ స్కూల్ విద్యార్థుల భక్తిరస నృత్య ప్రదర్శన వీక్షకులను కట్టిపడేసింది.

సీఆర్‌ఎస్‌లో అగ్నిప్రమాదం



రేణిగుంట: రేణిగుంట సమీపంలో ఉన్న సీఆర్‌ఎస్‌లోని స్క్రాబ్ యార్డ్‌లో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపు చేశారు. ఈక్రమంలోనే వెంకటాపురం వద్ద శేషాచలం అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. కొండ కింద ఇళ్ల వరకు మంటలు వ్యాపిస్తుండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

మగ్గానికి మహర్దశ



వరదయ్యపాళెంలో మగ్గంపై వస్త్రం నేస్తున్న చేనేత కార్మికుడు, వరదయ్యపాళెం మండలం సీఎల్ఎన్‌పల్లిలో మగ్గంపై వస్త్రం నేస్తున్న మహిళా కార్మికురాలు

- సత్యవేడు నియోజకవర్గంలో 729 మందికి నేతన్న నేస్తం లబ్ధి
- ఐదు విడతల్లో రూ. 8.74కోట్లు జమ
- ఆర్థిక సమస్యలు తీరాయని కార్మికుల హర్షం

రాష్ట్రంలో ఉనికి కోల్పోతున్న చేనేత వృత్తిదారులకు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జీవం పోశారు. గత టీడీపీ ప్రభుత్వంలో నిర్వీర్యం అయిన చేనేత కార్మికుల బతుకులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చి ఆర్థికంగా ఆదుకుంటున్నారు. ఎన్నికల ముందు పాదయాత్రలో స్వయంగా చేనేత కార్మికుల కష్టాలను, సమస్యలను, ఇబ్బందులను పరిశీలించారు. అధికారంలోకి రాగానే తమకు ఇచ్చిన హామీలను జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చడంతో నేతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సత్యవేడు నియోజకవర్గంలో 729 మందికి ఏడాదికి రూ.24 వేలు చొప్పున వైఎస్సార్ నేతన్న నేస్తం లబ్ధి అందింది.

వరదయ్యపాళెం: చేనేత కార్మికులకు నేతన్న నేస్తం పథకం ద్వారా సంవత్సరానికి రూ.24వేలు ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తోంది. వరుసగా 5వ విడత సాయం రూ.24వేల చొప్పున లబ్దిదారుల బ్యాంకు ఖాతాలకు ఇటీవల జమ అయ్యింది. సత్యవేడు నియోజకవర్గంలోని నారాయణవనం, నాగలాపురం, కేవీబీపురం, వరదయ్యపాళెం, సత్యవేడు, బీఎన్‌కండ్రిగ మండలాల్లో 729 మంది చేనేత కార్మికులు మగ్గాల ద్వారా వస్త్రాలు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరందరికీ సంవత్సరానికి రూ.24వేల చొప్పున ఐదు విడతల్లో రూ.8.74కోట్లు ఖాతాలకు జమ అయ్యింది. ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెద్ద ఎత్తున ఆర్థికసాయం అందడంతో నేతన్నల ఆనందానికి అవధులు లేదు. అంతేకాక అటకెక్కిన మగ్గాలు సైతం మళ్లీ వృద్ధిలోకి వచ్చాయి.జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రానున్న రోజుల్లో తమకు మరింత మేలు కలుగుతుందంటున్నారు.

మండలాల వారీగా లబ్ధిదారులు:

మండలం	లబ్ధిదారుల సంఖ్య
బీఎన్‌కండ్రిగ	56
నాగలాపురం	19
నారాయణవనం	450
సత్యవేడు	39
వరదయ్యపాళెం	164

చేనేత కార్మికుల ఆశలు చిగురించాయి



వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చేనేత కార్మికుల ఆశలు చిగురించాయి. ఆర్థిక సమస్యలు పరిష్కారమవుతున్నాయి. సంవత్సరానికి రూ. 24వేలు అందుతున్నాయి. ఎంతో ఆనందంగా ఉంది. గతంలో ఏ ప్రభుత్వం నగదు సాయం చేయలేదు. ప్రస్తుతం ఈ ఆర్థికసాయంతో చేనేత వృత్తిని వదలకుండా ఉపాధి పొందుతున్నాం.

–బి. భాస్కరరావు, వరదయ్యపాళెం

అక్కున చేర్చుకున్న సీఎం



కష్టాలు పడుతున్న నేతన్నలను అక్కున చేర్చుకున్నది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే. ఇచ్చిన మాట ప్రకారం వరుసగా ఐదు విడతలు రూ.24 చొప్పున సాయం చేశారు. ఇప్పటి వరకు రూ. 1.20లక్షలు ఆర్థికసాయం అందుకున్నాం. ఇవే కాకుండా వైఎస్సార్ చేయూత, ఆసరా వంటి పథకాలతో మా కుటుంబానికి ఎంతో లబ్ధి చేకూరింది.

–జి. చంద్రశేఖర్, చేనేత కార్మికుడు, సీఎల్ఎస్‌పల్లె

సాయం చారిత్రాత్మకం



చేనేత రంగాన్ని గత పాలకులు విస్మరిస్తే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకున్నారు. బడ్జెట్‌లో కేటాయింపులు పెంచుతూ చేనేత రంగం కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్నారు. వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ఏడాదికి రూ.24వేలు చొప్పున ఐదేళ్లలో ఒక్కో కుటుంబానికి రూ. 1.20లక్షలు సాయం చేయడం చారిత్రాత్మకం.

–గుత్తి కన్నయ్య, ఇందిరానగర్

ఆసరా కల్పిస్తున్నారు



చేనేత కుటుంబాలకు పనిలేక పోతే ఇల్లు గడవడం చాలా కష్టం. నేత కార్మికుల కుటుంబాలకు జగనన్న ఏడాదికి రూ.24వేలు ఇస్తూ భరోసా కల్పిస్తున్నారు. కరోనా కష్టకాలంలోనూ మాట తప్పకుండా మా ఖాతాల్లో నగదు జమ అయింది. నేతన్న నేస్తం చేనేత కార్మికులకు ఎంతోగానో ఉపయోగపడుతోంది.

–సజ్జా జానకి, సీఎల్ఎస్‌పల్లి

అప్పుల బాధ తప్పింది



నేను 30ఏళ్లుగా మగ్గం నేస్తూ అదే వృత్తిలో కొనసాగుతున్నాను. నూలు ధరలు పెరిగిపోయాయి. గిట్టుబాటు కావడం లేదు. నూలు, మెటీరియల్‌కు ప్రతి ఏడాది అప్పులు చేసేవాడిని. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక మాకు అప్పులు చేసే బాధ తప్పింది. ప్రభుత్వం ఇస్తున్న వైఎస్సార్ నేతన్న నేస్తం సాయం ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడుతోంది.

–రామలింగయ్య, మరదవాడ

అండగా నిలిచారు



ఎందరో నాయకులు వచ్చారు. చేనేతలకు అది చేస్తాం ఇది చేస్తాం అని వట్టి మాటలు చెప్పారు తప్ప ఆచరణలో చేసిందేమీ లేదు. చేనేత కార్మికులకు నేను అండగా ఉంటానని ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదు విడతలు ఏడాదికి రూ.24వేలు చొప్పున నా అకౌంట్‌లో రూ.1.20లక్షలు జమ చేశారు. ఆయనకు చిరకాలం రుణపడి ఉంటాం.

–జి. వెంకటరమణయ్య, సీఎల్ఎస్‌పల్లె

ఆర్థికంగా నిలబడగలిగాం



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేనేత కార్మికులకు ఇచ్చిన మాట ప్రకారం సంవత్సరానికి రూ. 24వేలు జమ చేశారు. అంతేకాక నా కుటుంబ సభ్యులకు వైఎస్సార్ చేయూత, ఆసరా, సున్నావడ్డీ రుణాలు, ఇతరత్రా పథకాలు అందుతుండడంతో ఈ ప్రభుత్వంలో ఆర్థికంగా నిలబడగలిగాం. భార్యాభర్తలం కలసి చేనేత పనులు చేసుకుంటున్నాం. ఇంత మంచి చేసిన ప్రభుత్వం మళ్లీ రావాలి.

–జి. విజయభాస్కర్, సీఎల్ఎస్‌పల్లె